

మానవత్వానికి తీరని మచ్చ
కుల పరువు హత్యలు 3


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 3 సంచిక -45 గురువారం16 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలక పాత్ర






**2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం**

**అత్యంత అధునాతనంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం**

**అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన**

**హైదరాబాద్‌జూలై 15 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడులపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమెజాన్ డేటా సెంటర్ ఫ్యూచర్ సిటీలో కీలక పాత్ర పోషించనుందని అన్నారు. అత్యంత అధునాతన నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఇక్కడ మరిన్ని పెట్టుబడులను**మిగతా 2లో...**

# మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం



**ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టుపై మండిపాటు**

**పోలవరం విషయంలో ఒకలా..ఇక్కడ మరోలా**

**రాష్ట్ర ఇంజనీర్ల నివేదికను బహిర్గతం చేయాలి**

**సిసిఐని తెరిపించాలని కేంద్ర మంత్రికి వినతి**

**ఢిల్లీలో మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**

**న్యూఢిల్లీ,జూలై 15 (జర్నలిస్ట్ వార్త):**
గతంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింటే.. ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదు. మేడిగడ్డ పిల్లర్ కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని కేంద్రం తీరుపై కెటిఆర్ మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్ఏ కాదు.. ఎన్డీఏ అన్నారు. దిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ విషయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తీరుపై కేటీఆర్ విమర్శలు చేశారు. తెలంగాణలో కోటి ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి 30 శాతం వసూళ్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు చేస్తున్న పనులకు పొంతన లేదు. కాళేశ్వరంపై ఆయన పగబట్టి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఇంజినీర్లు ఇచ్చిన నివేదికను బయటపెట్టాలని **మిగతా 2లో...**



# పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ**

**షాబాద్ ఘటనపై రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ లేఖ**

**పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన వైనం**

**పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని పవన్ ఆరోపణ**

**బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ**

**హైదరాబాద్ జూలై 15 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.**మిగతా 2లో...**

# పారిశ్రామికి అభివృద్ధి లక్ష్యంగా ప్రోత్సాహం

**గత ప్రభుత్వాల పాలసీలను కొనసాగిస్తున్నాం**

**మా ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదు**

**పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు 9 టిఎంసిల నీటికి యత్నం**

**దివిటిపల్లిలో అమరరాజా బ్యాటరీ ప్రారంభించిన సిఎం రేవంత్**



**మహబూబ్‌నగర్,జూలై 15 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా గత ప్రభుత్వాల పాలసీలను కొనసాగిస్తున్నామని, అందులో మంచివుంటే మరింత మెరుగ్గా ముందుకు సాగుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మా ప్రభుత్వానికి పాలసీపెరాలసిస్ లేదని అన్నారు. గత ప్రభుత్వాల పాలసీలను మరింత మెరుగుపర్చి ముందుకు తీసుకెళ్తున్నాం అని అన్నారు. 1994 నుంచి 2004వరకు చంద్రబాబునాయుడు, 2004 నుంచి 2014వరకు వైస్ రాజశేఖర్ రెడ్డి, 2014 నుంచి 2023డిసెంబర్ వరకుగత ప్రభుత్వాలు తీసుకువచ్చిన పాలసీలను మా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. గతప్రభుత్వాలపాలసీల్లో ఉన్న మంచి మేం కూడా ప్రోత్సహిస్తున్నాం.. మహబూబ్ నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.**మిగతా 2లో...**

# త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటన**



**హైదరాబాద్,జూలై 15 (జర్నలిస్ట్ వార్త):**
ఈనెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ

# భారత్ పెట్టుబడుల్లో 25శాతం ఏపీకే

**త్వరగా అనుమతులు ఇవ్వడం వల్ల పెట్టుబడుల రాక**

**దాల్మియా సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ**

**శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్**

**జగన్‌ది హింట్ అండ్ రన్ పార్టీ అంటూ విమర్శలు**

**కడప,జూలై 15 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో అనుమతులు త్వరగా ఇవ్వడం వల్లే భారీగా పెట్టుబడులు వస్తున్నాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయని అన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోటీపడి పరిశ్రమలను తీసుకొస్తున్నామని చెప్పారు. వైఎస్ఆర్ కడప జిల్లా మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ రెండోప్లాంట్ విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. **2లో...**



# 'అభయ' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనిత

**మహిళల భద్రత కోసం అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్న అనిత**

**చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని సూచన**

**బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిల్లలకు హితవు**





# తెలంగాణ, కర్ణాటక సహా నాలుగు రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ పొడిగింపు

**ఇంటింటి సర్వే కోసం బూత్ లెవల్ అధికారులకు అదనపు సమయం**

**తెలంగాణలో ఆగస్టు 10న ముసాయిదా, అక్టోబర్ 12న తుది జాబితా**

**కర్ణాటకలో ఆగస్టు 17న ముసాయిదా, అక్టోబర్ 19న తుది జాబితా విడుదల**

**హైదరాబాద్ జూలై 15 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఎన్యుమరేటర్లు వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని స్పష్టం చేసింది.తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఇదే తేదీలోగా పూర్తి చేయనున్నారు.
**మిగతా 2లో...**



## భారత్ పెట్టుబడుల్లో 25శాతం ఏపీకే




**మొదటిపేజీ తరువాయి**

దాల్మియా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియాతో కలిసి లోకేశ్ భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. సిమెంట్ ఉత్పత్తి రంగంలో దాల్మియా గ్రూప్ బలమైందన్నారు. దీంతో ఎంతో మందికి ఉపాధి లభిస్తోందని చెప్పారు. వైకాపా హయాంలో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ చాలా దెబ్బతిందన్నారు. మళ్లీ అభివృద్ధి స్థాయికి రాష్ట్రాన్ని తీసుకురావడానికి రెండేళ్లు అహర్నిశలు కష్టపడ్డామని చెప్పారు. రూ.3,100 కోట్లతో చేపడుతున్న ఈ పరిశ్రమ విస్తరణ పనులతో మరో 700 మందికి ఉపాధి లభించనుంది. ఈ సందర్భంగా మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నారా లోకేశ్ మరోసారి విరుచుకుపడ్డారు. జగన్ కడపకు పట్టిన క్యాన్సర్ గడ్డ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంత బాబాయి వివేకానంద రెడ్డిని చంపింది జగనే అని ఆరోజు పాదయాత్రలో చెప్పానని... ఈరోజు కూడా చెబుతున్నానన్నారు. జగన్ పార్టీ.. హిట్ అండ్ రన్ పార్టీ అంటూ దుయ్యబట్టారు. 'మాజీమంత్రి కొడుకు రోడ్డు ప్రమాదం చేసి ఒకరిని చంపితే తప్పుకాదా? కొడుకు తప్పు చేస్తే ఒక కేంద్రమంత్రి వెంటనే సరెండర్ చేశారు. మీ మాజీమంత్రి తప్పు చేస్తే.. మీరేం చేశారు? గతంలో జగన్ కారు టైర్ల కింద నలిగి ఒకరు చనిపోయారు. ఇవన్నీ వీళ్లకు చిన్న విషయాలులానే ఉంటాయి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రాహ్మణీ స్టీల్స్‌కు అప్పట్లో ఎకరాకు రూ.19 వేల చొప్పున 11 వేల ఎకరాలు కేటాయించారని మంత్రి తెలిపారు. బ్రాహ్మణీ వల్ల లబ్ధి పొందింది.. గాలి జనార్దన్ రెడ్డి, జగన్ రెడ్డిలు మాత్రమే అని అన్నారు. లీగల్ ప్రాసెస్ చూసుకొని ఆ భూములను స్వాధీనం చేసుకుంటున్నామని చెప్పారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసిందేమీ లేదని విమర్శించారు. జగన్ హయాంలో 250 మంది మత్స్యకారులు చనిపోతే ఒక్కరికీ పరిహారం ఇవ్వలేదని అన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో బాధిత మత్స్యకారుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ.10 లక్షల పరిహారం ఇచ్చినట్లు తెలిపారు. జగన్ హయాంలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని.. కూటమి ప్రభుత్వ హయాంలో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. మళ్లీ నోటిఫికేషన్‌లు ఇస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

## 'అభయ' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనిత

**విజయవాడ,జూలై 15 (జర్నలిస్ట్ వార్త):**

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు చాలా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై ఓ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని వేంపాడు టోల్ ప్లాజా సమీపంలోని భారతి కన్వెన్షన్‌లో 'అభయ' కార్యక్రమాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా 'అభయ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 'మహిళల భద్రత – మా బాధ్యత' అంటూ అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఎన్నో పోరాటాల వలన మహిళలకు స్వేచ్ఛ వచ్చిందని గుర్తు చేశారు. మహిళలకు ధైర్యం కల్పించడానికి 'అభయ' కార్యక్రమాన్ని పోలీసులు ప్రారంభించారని తెలిపారు. చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. పిల్లలను తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని... కష్టపడి చదువుకొని, ఉన్నత స్థాయికి వెళ్ళాలని ఈ సందర్భంగా పిల్లలకు ఆమె సూచించారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని అనిత సూచించారు. ఎవరైనా మిమ్మల్ని ఇబ్బంది పెడితే తక్షణమే 112కి కాల్ చేయాలని అన్నారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని వివరించారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకండి అంటూ పిల్లలకు హితవు పలికారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో కూడా అభయ ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

## తెలంగాణ, కర్ణాటక సహా నాలుగు రాష్ట్రాల్లో
# ఎస్ఐఆర్ పొడిగింపు

**మొదటిపేజీ తరువాయి** తెలంగాణలో ఆగస్టు 10న, పంజాబ్‌లో ఆగస్టు 13న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు తెలంగాణలో సెప్టెంబర్ 9 వరకు, పంజాబ్‌లో సెప్టెంబర్ 12 వరకు అవకాశం కల్పించారు. అనంతరం, అక్టోబర్ 12న రెండు రాష్ట్రాల్లోనూ తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో జూన్ 30న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 8 వరకు పొడిగించారు. ఆగస్టు 17న ముసాయిదా జాబితాను విడుదల చేసి, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అన్ని ప్రక్రియలను పూర్తి చేసి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను వెల్లడిస్తారు.బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) చేపట్టే ఇంటింటి సర్వేలో భాగంగా నకిలీ ఓట్లు తొలగింపు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి సవరణలు చేపడతారు. సవరించిన గడువులను కచ్చితంగా పాటించాలని ఆయా రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

## త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

**మొదటిపేజీ తరువాయి**

అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్ ÷నైల్ అని స్పష్టం చేశారు.ఎంపీ రేణుకా చౌదరితో మాట్లాడానని మహేశ్ తెలిపారు. 'తాను మాట్లాడిన ఉద్దేశం వేరని నాతో అన్నారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని అన్నట్లు రేణుక నాతో చెప్పారు.. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు' అని తెలిపారు. కూనంనేని మిత్రపక్షం అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉందన్నారు. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడి ఉంటారని చెప్పుకొచ్చారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానిక గా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికి గాంధీభవన్‌కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు. నలుగురు ఐదుగురు మినహా అందరు డీసీసీ అధ్యక్షుల పని తీరు బాగుందని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

## పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు. పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో దర్యాప్తులో నిర్దిష్ట కాలపరిమితిని పాటించాలని, సాక్ష్యాధారాలు తారుమారుకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.సదరు కేసులో నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం, అదే సమయంలో బాధితుల కుటుంబానికి తగిన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమవడంపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పోక్సో కేసులకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

# మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం

**మొదటిపేజీ తరువాయి**

కెటిఆర్ ఢిల్లీలో మీడియాతో అన్నారు. గత రెండేళ్లలో కేసీఆర్ ఏ ఒక్కరి పేరు పెట్టి విమర్శలు చేయలేదు. రేవంత్‌కు మాత్రం.. కేసీఆర్ పేరు తలవని రోజు లేదు. రెండు రోజులు ఢిల్లీలోనే ఉన్న సీఎం.. ఎన్డీఎస్ఏ అధికారులను ఎందుకు కలవలేదన్నారు. ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదికకు.. తుది నివేదికకు చాలా వ్యత్యాసం ఉంది. మేడిగడ్డపై చూపిన శ్రద్ధ.. మిగతా రాష్ట్రాలపై ఎందుకు చూపలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ పనితీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్లిష్ట సమయంలోనూ పట్టిసీమ నుంచి నీటిని ఎత్తిపోస్తూ రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో ఆ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత.. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వట్లేదన్నారు. సముద్రంలోకి పోయే నీటి వినియోగానికి ఏపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిసి ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశామని అన్నారు. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷–లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ఎ÷–లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.సీసీఐ సాధన సమితి చేస్తున్న పోరాటం అభినందనీయం. మేం కూడా దీన్ని మళ్లీ నడపాలని కోరికతోనే ఉన్నామని కేంద్రమంత్రి అన్నారని కేటీఆర్ వెల్లడించారు. దాదాపు 230 ఎకరాలు అక్కడ ల్యాండ్ ఉన్నది. ఒక 770 ఎకరాలు ప్రైవేట్ పట్టా ల్యాండ్ కంపెనీకి ఉంది. అట్లాగే 1500పై చిలుకు ఎకరాలు లీజ్ ల్యాండ్ ఉంది. మరి 2 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో కొత్త ఫ్యాక్టరీతో పెడితే బాగుంటదన్నారు. ఏమైంది ఎందుకు తెరవలేకపోతున్నరని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం కొంత స్పందించడం లేదు.. సంవత్సర కాలంగా మేం ప్రయత్నం చేస్తున్నం. కానీ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ పొడిగించాలి. వాళ్లు ముందుకు రావడం లేదు. మరి రాష్ట్ర ప్రభుత్వం ఏం సబ్సిడీ ఇస్తదా.. ఏమన్నా పెట్టుబడి పెడ్తతా..? జీఎస్టీ మినహాయింపు ఇస్తదా? చెప్పమంటే చెప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది నుంచి పెద్దగా స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారని కేటీఆర్ వివరించారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రికి సీసీఐ సాధన సమితి తరపున ధన్యవాదాలుతెలియజేస్తూ.. మేం అధికారంలో ఉన్నప్పుడు సిర్పూర్ పేపర్ మిల్లు తెరిపించాం. అదే ఆదిలాబాద్‌జిల్లాలో మళ్లీ వెంబడ పడి తిరిగి తెరిపించి ఇవాళ వేలాది మందికిఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినం. సీసీఐని పునరుద్ధరిస్తామని ఎన్నికల ప్రచారంలో అమిత్ షా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారు. సీసీఐని పునరుద్ధరిస్తే వేలాదిమందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

# ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలక పాత్ర

**మొదటిపేజీ తరువాయి**

ఆహ్వానిస్తున్నాం. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలనేది మా లక్ష్యం. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఐఎస్‌బీ, నల్సార్ సహా అనేక సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో ఓఆర్ఆర్, విమానాశ్రయం, ఫార్మా కంపెనీలు అనేక సేవలు అందిస్తున్నాయి. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారబోతున్నాం. పరిశ్రమలు, టూరిజం, క్రీడా నైపుణ్యం, వైద్య రంగాల్లో పాలసీలు తెచ్చాం. హైదరాబాద్‌లోని 3వేల ఆర్టీసీ బస్సులు, 2లక్షల ఆటోలను ఈవీలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నాం. గొప్ప నగరంగా మారాలనే మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టాం. ఫార్మా పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తీసుకెళ్తున్నాం. హైదరాబాద్‌లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు. పన్నెండేళ్ల వ్యవధిలో అమెజాన్ విస్తరణకు రూ.60వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఆ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పరస్పర అంగీకారం కుదుర్చుకుంది. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్ విస్తరణ కోసం 202 ఎకరాలు, చందన్‌వెల్లిలో 98 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.125 కోట్ల విలువ చేసే ప్రోత్సాహకాలు, రాయితీలు అమెజాన్‌కు అందించింది. తొలి విడతలో భాగంగా.. 24 నెలల్లో నిర్మాణ సంబంధిత పనులు పూర్తవుతాయి. అనంతరం రాబోయే 10 ఏళ్లలో మిగతా పనులు పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లో క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, డిజిటల్ బ్యాంకింగ్, ఈ–కామర్స్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు అవసరమైన డిజిటల్ మౌలిక వసతులు మరింత బలోపేతం కావడంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు. ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్ మారనుందని, ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. పాలసీలపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అమెజాన్ డేటా సెంటర్ స్టెప్పింగ్ స్టోన్‌గా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీకి రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణం జరగనుంది.12 ఏళ్లలో రూ.60వేల కోట్లను అమెజాన్ వెచ్చించనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పారిశ్రామికి అభివృద్ధి లక్ష్యంగా ప్రోత్సాహం

**మొదటిపేజీ తరువాయి**

మంత్రులు శ్రీధర్ బాబు,జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి,అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్,ప్రభుత్వ విప్ యన్నం శ్రీనివాస్ రెడ్డి,ఎంపీ లు డీకే అరుణ,మల్లు రవి, ఉమ్మడి జిల్లా ఎంఎల్ఏ లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హాజరయ్యారు. అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ప్లాంట్ ఆవరణలో ముఖ్యమంత్రి మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరరాజా అద్భుతమైన పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేసిందని, 1983 లో అమరరాజా చిత్తూరు జిల్లాలో మొదటిసంస్థను ఏర్పాటు చేసిందన్నారు. అమర రాజా సంస్థ ఏర్పాటు చేసి 40 యేళ్లు అవుతోందన్నారు. అమర రాజా గ్లోబల్ సంస్థ.. అంటూ అమర రాజా కు దేశంలో పోటీ లేదన్నారు. చైనా, జపాన్, జర్మని, కొరియా లాంటి దేశాలనుఆదర్శంగా తీసుకుని అమర రాజా సంస్థ పనిచేస్తోందన్నారు. ప్రపంచంలో చైనా ఈవీవెహికిల్స్ కు లీడర్ గా ఉంది.. ఈవీ లో చైనాతో అమర రాజా సంస్థ పోటీ పడిపనిచేస్తోంది.. కాలుష్యం వేగంగా విస్తరిస్తోంది.. వాతావరణంలో మార్పులు వేగంగా వస్తున్నాయి.. ఎలినినో ప్రభావం కారణంగా వర్షాలు పడటం లేదు.. రైతులు ఇబ్బంది పడుతున్నారు.. కోవిడ్ తర్వాత వాతావరణంలోచాలా మార్పులు వచ్చాయని సిఎం అన్నారు. కాలుష్యం తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది.. కాలుష్య నియంత్రలోఈవీవెహికిల్స్అవసరం ఉంది.. దివిటిపల్లి అమర రాజా యూనిట్ లో 700 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు..ఇందులో 400 మంది మహిళా ఉద్యోగులు ఉండటంమహిళా సాధికారిత కు




నిదర్శనం.. తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా పాలసీలుతీసుకువస్తున్నాం.. ప్రస్తుతం దేశ జీడీపీలో5 శాతం తెలంగాణ వాటా గా ఉంది.. కాని నేను దీనిపైన సంతోషంగా లేను.. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం.. 2034 నాటికి తెలంగాణను వన్ట్రిలియన్డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే మా ధ్యేయం అన్నారు. అమర రాజా లాంటి సంస్థలు తెలంగాణ రైజింగ్ కు మద్దతుగా ఉంటున్నాయి.. తెలంగాణనుక్యూర్, ప్యూర్, రేర్ గా విభజించిపాలసీలు రూపొందించి ముందుకు వెళ్తున్నాం.. బ్లూ కాలర్ జాబ్ ల కోసం ఏటీసీలు, పాలిటెక్నిక్ లు ఏర్పాటు చేస్తున్నాం.. ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి, బీమా, ఆర్డీఎస్, నెట్టంపాడు వంటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం.. త్వరలోనే మహబూబ్‌గర్ జిల్లా ప్రజలకుశుభవార్త వినిపిస్తున్నాం. పక్క రాష్ట్రంతో సంప్రదింపులుజరుగుతున్నాయి.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీ లు సాధించే దిశగాచర్చలుజరుగుతున్నాయి.. డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీ కేటాయింపుల పై చర్చలుజరుపుతున్నాం.. పరిశ్రమలకు అనుకూల వాతావరణంసృష్టించి జిల్లా లో ఉపాధి అవకాశాలుకల్పిస్తాం.. పాలమూరు జిల్లాలో చాలా మంది రైతులు అమర రాజా కు భూములు ఇచ్చారు.. అత్యధిక ఉద్యోగాలు వాళ్లకుఇవ్వాలని కోరుతున్నట్లు వెల్లడించారు. ఆర్ అండ్ బీ మినిస్టర్ గా గల్లాజయ్ దేవ్ తల్లి గల్లా అరుణ కొడంగల్ లో చాలా రోడ్లు మంజూరు చేశారు.. నేను రెండో సారి గెలవడానికి నాకు అవి ఉపయోగపడ్డాయని రేవంత్ అన్నారు.

----------------

## బంజారాహిల్స్ తాజ్ హోటల్ కూల్చివేత! భారీ టవర్ నిర్మాణానికి సన్నాహాలు

హైదరాబాద్ నగర చిహ్నంగా నిలిచిన బంజారాహిల్స్‌లోని తాజ్ బంజారా హోటల్ ఇక చరిత్రలో కలిసిపోనుంది. నగర ఆతిథ్య రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ఈ హోటల్ కూల్చివేత పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. ఈ స్థలంలో సుమారు 40 అంతస్తుల భారీ నివాస సముదాయాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.బంజారా లేక్‌ను ఆనుకుని ఉన్న 3.4 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ఆస్తిని అరబిందో రియాల్టీ సంస్థ రూ.315 కోట్లకు దక్కించుకుంది. 2023లోనే హోటల్ కార్యకలాపాలు నిలిచిపోగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరులో కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. మొదటగా తలుపులు, కిటికీలు, ఇతర ఫర్నిచర్‌ను తొలగించిన యంత్రాంగం,



ప్రస్తుతం ప్రధాన భవనాన్ని నేలమట్టం చేస్తోంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరో నాలుగు నెలల సమయం పట్టవచ్చని అంచనా.1979లో ఏర్పాటైన తాజ్ బంజారా, నగరంలోని తొలి విలాసవంతమైన హోటళ్లలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. సినీ ప్రముఖులకు, పారిశ్రామికవేత్తలకు ఇది దశాబ్దాల పాటు ఇష్టమైన వేదికగా నిలిచింది. 1986 వరకు ఐటీసీ గ్రూప్ నిర్వహణలో ఉండగా, ఆ తర్వాత సుమారు నాలుగు దశాబ్దాల పాటు తాజ్ జీవీకే హోటల్స్ దీన్ని విజయవంతంగా నడిపించింది.

అయితే, ఆస్తిపన్ను బకాయిల కారణంగా జీహెచ్ఎంసీ అధికారులు ఈ హోటల్‌ను తాత్కాలికంగా సీల్ చేశారు. సుమారు రూ.1.43 కోట్ల బకాయిలతో పాటు ఇతర కారణాల వల్ల ఇది మూసివేతకు దారితీసింది.

# రోడ్డుకు ఆమోదం.. మంత్రికి కృతజ్ఞతలు





**ఎల్కతుర్తి, /జూలై 15 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని రహదారి సమస్యపై వరుసగా వెలువడిన వార్తలకు స్పందించి రహదారి పనులకు ఆమోదం తెలిపిన బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, ప్రభుత్వ విప్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి రహదారిని పరిశీలించి పనులు మంజూరు చేయించడంలో చొరవ చూపినట్లు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎడ్ల మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ప్రజలకు గృహం, విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం ముందంజలో ఉందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం భారీ అప్పుల ఊబిలో చిక్కుకుపోయిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని, రానున్న రోజుల్లో మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు అమలు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

## రైతులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు: కలెక్టర్





**వైరా,/ జూలై 15 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కొణిజర్ల మండలం అంజనాపురంలోని గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలీసు కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన ప్రతిష్ఠాత్మక కార్యక్రమమని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, వెలుతురు, బ్యారికేడింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు.
సభా ప్రాంగణంలో వీఐపీలు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వరకు రహదారులు, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు.
భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేయాలని పోలీసు శాఖకు సూచించిన కలెక్టర్, వైద్య బృందాలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచడంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ప్రతి శాఖ అప్పగించిన బాధ్యతలను గడువులోగా పూర్తి చేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు.

# వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ తర్వాతే జీహెచ్ఎంసీ ఎన్నికలు: గిద్దె రాజేష్



**పెన్‌పహాడ్,/ జూలై 15 (జర్నలిస్ట్ వార్త):** వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించేలా తెలంగాణ ప్రభుత్వం చట్టం తీసుకురావాలని, ఆ తర్వాతే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు నిర్వహించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. పెన్‌పహాడ్ మండల కేంద్రంలో బుధవారం జరిగిన సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా వికలాంగుల సమస్యలపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరగకపోవడం విచారకరమన్నారు. వికలాంగులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు సామాజిక భద్రతా పెన్షన్‌ను రూ. 6 వేలుకు పెంచడం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, బ్యాక్లాగ్ ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక నోటిఫికేషన్, ప్రత్యేక వికలాంగుల సంక్షేమ శాఖ ఏర్పాటు, వికలాంగుల హక్కుల చట్టం2016 అమలు, పెండింగ్ పింఛన్ల మంజూరు వంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. హామీల అమలు వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే గాంధీభవన్‌ను లక్షలాది మంది వికలాంగులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య బాబు, జిల్లా అధ్యక్షుడు గోగుల శేఖర్ రెడ్డి, పేర్ల సోమయ్య యాదవ్, కొండ సైదులు యాదవ్, మున్న మధు యాదవ్, కోమటిరెడ్డి కృష్ణారెడ్డి, గార్లపాటి వెంకటరెడ్డి, గుండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ ప్రత్యూష



**తల్లాడ,/ జూలై 15 (జర్నలిస్ట్ వార్త):**
సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష సూచించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, పోషకాహారం తీసుకోవడంతో పాటు గుడ్లు, పాలు, ఆకుకూరలను ఆహారంలో చేర్చుకోవాలని, తగినంత మంచినీరు తాగాలని తెలిపారు. కలుషిత నీరు, కలుషిత ఆహారాన్ని తీసుకోవద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం, జలుబు, దగ్గు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవాలని కోరారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని డాక్టర్ ప్రత్యూష పేర్కొన్నారు.

# గిరిజన చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ



**ఏన్కూరు,/ జూలై 15 (జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని మేడేపల్లి గిరిజన గ్రామంలో చిన్నారులకు విద్యా సామగ్రి, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఏన్కూరు నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలోని అడవి గ్రామంలో నివసిస్తున్న సుమారు 50 మంది చిన్నారులకు పెన్నులు, పలకలు, నోటుబుక్కులు, ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. అలాగే 20 మంది వృద్ధులకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా బ్రదర్ కే.వి. ఇశ్రాయేలు మాట్లాడుతూ గ్రామంలో రహదారి, విద్యుత్, రవాణా, సమాచార సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం గ్రామాన్ని గుర్తించి విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. గ్రామాల అభివృద్ధితోనే భావితరాల భవిష్యత్తు మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గొల్లమందల దేవాసహాయం, గుంటి బాబురావు, నిరీక్షణరావు, ఎలిషా, అమ్మపాము తిమోతి తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణకు ప్రతి పౌరుడు తోడ్పడాలి



**వైరా/, జూలై 15 (జర్నలిస్ట్ వార్త):** నీటి సంరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని వైరా మున్సిపల్ కమిషనర్ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జల్ సంచయ్‌జన్ భాగిధారి3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువత వర్షపు నీటి సంరక్షణ చర్యల్లో భాగస్వాములు కావాలన్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటు, నీటి వృథా నివారణ, భూగర్భ జలాల పెంపు, చెరువుల పరిరక్షణ, ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు భావితరాలకు నీటి భద్రత కల్పించవచ్చన్నారు. నీటి ప్రతి బొట్టు విలువైనదని, ప్రజల సహకారంతోనే కార్యక్రమం విజయవంతమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని నీటి సంరక్షణకు కట్టుబడి ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రగతి పతనమా?

## మానవత్వానికి తీరని మచ్చ కుల పరువు హత్యలు



సాంకేతిక విప్లవంతో ప్రపంచం అరచేతిలోకి వచ్చేసింది. అంతరిక్షంలోకి రాకెట్లు దూసుకెళ్తున్నాయి. నాగరికత శిఖరాగ్రానికి చేరుకుంటోందని మనం గొప్పలు చెప్పుకుంటున్నాం. కానీ, మన ఆలోచనలు మాత్రం ఇంకా మధ్యయుగాల నాటి అంధకారంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. అభ్యుదయ భావాలు, సమానత్వం గురించి వేదికలపై గొంతు చించుకునే సమాజం. కులం అనే రంగు అద్దాలను తీసి పక్కన పెట్టలేకపోతోంది. ప్రేమ, పెళ్లి అనే వ్యక్తిగత స్వేచ్ఛా నిర్ణయాలను. కుల అహంకారం, కపట పరువు అనే ఇనుప గొలుసులతో బంధిస్తోంది. ఆ బంధనాలను తెంచుకోవాలని చూస్తే, ఏకంగా కన్నబిడ్డల ప్రాణాలనే బలి తీసుకుంటోంది. ఇటీవల తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న కుల పరువు హత్యలు మన నాగరిక సమాజం సిగ్గుతో తలదించుకునేలా చేస్తున్నాయి. ప్రేమ అనేది రెండు మనసుల కలయిక. రాజ్యాంగం ప్రకారం మేజర్లయిన ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన భాగస్వామిని ఎన్నుకునే హక్కు ఉంది, ఈ ప్రాథమిక హక్కును అణచివేయడానికి కుల గౌరవం అనే మాయా పదాన్ని ఆయుధంగా వాడుతున్నారు. తాము పెంచి పెద్ద చేసిన సొంత బిడ్డల ప్రాణాల కంటే, సమాజంలో కేవలం ఒక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు ఏమనుకుంటారో అనే భయమే తల్లిదండ్రులను హంతకులుగా మారుస్తోంది. కులాంతర వివాహం చేసుకున్నారనో, తమకంటే తక్కువ అనుకునే కులాల వారిని ప్రేమించారనో. సొంత రక్తాన్నే నడిరోడ్డుపై నరికి చంపేస్తున్నారంటే మన సంస్కృతి ఎటు వైపు ప్రయాణిస్తోంది?
పరువు అనేది మనుషుల ప్రాణాలలో ఉంటుందా లేక పక్కవాడి చూపుల్లో ఉంటుందా? కన్నబిడ్డ ప్రాణం తీశాక మిగిలే ఆ కపట పరువు సమాజానికి ఏ సందేశాన్ని ఇస్తుంది? ఈ దారుణాలకు ప్రధాన కారణం సమాజంలో వేళ్లూనుకుపోయిన సంకుచిత కులతత్వమే. ఒక మనిషి విలువను అతని గుణాన్ని బట్టి కాకుండా, పుట్టిన కులాన్ని బట్టి అంచనా వేసే జబ్బు ఇంకా తగ్గలేదు. చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ, కోర్టులు మొట్టికాయలు వేస్తున్నప్పటికీ ఈ తరహా దాడులు ఆగడం లేదు. పోలీసులు, యంత్రాంగం కూడా కొన్ని సందర్భాల్లో బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమవుతున్నారు. ప్రేమించుకున్న జంటలు రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించినప్పుడు... వారిని కౌన్సిలింగ్ పేరుతో మళ్లీ అదే మతోన్మాద, కులోన్మాద కుటుంబాల చేతుల్లో పెట్టడం ఘోరమైన తప్పిదం. ఇలాంటి ఆటవిక చర్యలకు చరమగీతం పాడాలంటే కేవలం చట్టాలు మాత్రమే సరిపోవు. సత్వర న్యాయం: పరువు హత్యల కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారించి, దోషులకు కఠినమైన శిక్షలు అతి తక్కువ కాలంలో పడేలా చూడాలి. ఈ శిక్షలు సమాజంలో భయాన్ని కలిగించాలి. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం, పోలీసులు పూర్తి స్థాయి రక్షణ కల్పించాలి. వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించేలా ప్రత్యేక హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలి. కేవలం మార్కుల కోసం చదివే చదువు కాకుండా, తోటి మనుషులను గౌరవించే సంస్కారాన్ని నేర్పే విద్యా విధానం రావాలి.
సమాజంలో కుల వ్యవస్థ నిర్మూలనకు పౌర సమాజం, మేధావులు, కళాకారులు నడుం బిగించాలి. సినిమాల్లో, ప్రసార మాధ్యమాల్లో కుల అహంకారాన్ని గ్లోరిఫై చేసే ధోరణికి అడ్డుకట్ట వేయాలి. కన్నప్రేమను చంపేసి, కసాయిలుగా మార్చే పరువు. అస్సలు పరువే కాదు, అది ఒక సామాజిక జాడ్యం. ఈ కుళ్లిన వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత నేటి తరంపై ఉంది. కులం పునాదులపై కట్టిన పరువు కోటలను బద్దలుకొట్టి, మానవత్వమే పరమావధిగా బతికే రోజు కోసం ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. లేదంటే, మన ప్రగతి ప్రయాణం కేవలం కాగితాలకే పరిమితమై ఆచరణలో మనం అడవి మనుషులకంటే హీనంగా మిగిలిపోతాం.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్
సెల్ నంబర్ 9701249103

# యూరియా కొరత వెంటనే నివారించాలి

## జీవీఎస్ డిమాండ్




**ఏన్కూరు,/ జూలై 15 (జర్నలిస్ట్ వార్త):**
ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా ఎరువులను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని గిరిజన విద్యార్థి సంఘం (జీవీఎస్) డిమాండ్ చేసింది. మండలంలోని సహకార సంఘాలు, ఎరువుల పంపిణీ కేంద్రాల్లో యూరియా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం మండల అధ్యక్షుడు బోడా ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. వరి, పత్తి, మిర్చి పంటలు కీలక దశలో ఉన్న సమయంలో యూరియా కొరత వల్ల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. అధికారులు కొరత లేదని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో రైతులకు బస్తాలు అందడం లేదని విమర్శించారు. సొసైటీల వద్ద గంటల తరబడి వేచి చూసినా యూరియా దొరకక, రైతులు ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి రైతులు ఇబ్బందులు పడుతుండగా, యూరియా కొరత మరింత భారంగా మారిందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి మండలంలోని అన్ని సొసైటీలకు తగినంత యూరియా సరఫరా చేసి, పారదర్శకంగా పంపిణీ చేపట్టాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకుంటే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బోడా ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు.

# వైద్యశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

### నర్సంపేట ఆసుపత్రి అభివృద్ధిపై వినతి

**నర్సంపేట,/ జూలై 15 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పన, వైద్యులు, సిబ్బంది నియామకం, అధునాతన వైద్య పరికరాల ఏర్పాటుపై నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను బుధవారం హైదరాబాద్ సచివాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవల మెరుగుదల, అవసరమైన సిబ్బంది నియామకం, మౌలిక వసతుల కల్పనపై మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. సంబంధిత అంశాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



# కౌలు రైతుల గుర్తింపే లక్ష్యం.. మరో ఉద్యమం

### డీబీఎఫ్ హెచ్చరిక.. తహసీల్దార్‌కు వినతి



**హసన్‌పర్తి, /జూలై 15 (జర్నలిస్ట్ వార్త):** కౌలు రైతులను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేసే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ హెచ్చరించారు. డీబీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం అదనపు తహసీల్దార్ రవికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గుర్తింపు లేక కౌలు రైతులు ఎరువులు, రైతు భరోసా, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందలేకపోతున్నారని అన్నారు. పండించిన పంటను విక్రయించడంలోనూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కౌలు రైతులకు వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేసి, ప్రభుత్వ పథకాలన్నింటినీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరో దశ ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా కార్యదర్శి బౌతు రాధ, ఉపాధ్యక్షులు చుంచు నరేష్, మేకల అనిత, నాయకులు మాదాసి సురేష్, సముద్రాల కుమారస్వామి, రుద్రారపు సౌందర్య, సముద్రాల అఖిల, రుద్రారపు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఎస్ఐఆర్ పూర్తి చేయాలి

### వంద శాతం డిజిటలీకరణకు సహకరించాలి: కలెక్టర్ దివాకర్ టీఎస్

**ఖమ్మం,/ జూలై 15 (జర్నలిస్ట్ వార్త):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 12.43 లక్షల మంది ఓటర్లలో ఇప్పటివరకు 8.48 లక్షల మంది వివరాలను డిజిటలీకరించినట్లు తెలిపారు. జూలై 24 వరకు ఇంటింటి సర్వే, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా, అక్టోబర్ 1న తుది జాబితా విడుదల చేస్తామని చెప్పారు. వివరాలు అసంపూర్తిగా ఉన్న ఓటర్లు నోటీసులు అందిన వెంటనే అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు తుది జాబితాలో చోటు కల్పించడమే లక్ష్యమని, వంద శాతం డిజిటలీకరణ కోసం ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు.




# గంగదేవిపల్లి తరహాలో ఎల్కుర్తి అభివృద్ధి

### ఆదర్శ గ్రామాన్ని సందర్శించిన సర్పంచ్ సుధాకర్




**ధర్మసాగర్, /హనుమకొండ బ్యూరోజూలై 15 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కుర్తి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆ గ్రామ సర్పంచ్ నరిసేటి సుధాకర్ అన్నారు. బుధవారం గీసుకొండ మండలంలోని ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఆయన సందర్శించి అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య నిర్వహణ, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణతో పాటు మౌలిక సదుపాయాలను పరిశీలించి స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించారు. గంగదేవిపల్లి అభివృద్ధి నమూనాను అధ్యయనం చేసి, ఎల్కుర్తిలో కూడా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా కార్యాచరణ రూపొందిస్తామని సుధాకర్ తెలిపారు. ఈ పర్యటనలో ఎల్కుర్తి గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అసైన్ భూములకు పూర్తి హక్కులు కల్పించాలి

### ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ అడ్డూరి అనిల్ మాదిగ




**ఎల్కతుర్తి/హనుమకొండ బ్యూరో, జూలై 15: (జర్నలిస్ట్ వార్త)** రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదలకు కేటాయించిన అసైన్ భూములకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ అడ్డూరి అనిల్ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

భూమిలేని నిరుపేదలు, ముఖ్యంగా దళితులు, ఆదివాసీలు, గిరిజన కుటుంబాల జీవనోపాధి కోసం ప్రభుత్వం గతంలో అసైన్ భూములను కేటాయించిందన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న చట్టపరమైన పరిమితుల కారణంగా భూములను విక్రయించలేక, బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందలేక వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. పూర్తి హక్కులు లేకపోవడంతో ప్రభుత్వం కల్పించిన ఆస్తిని పేదలు పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. వరంగల్ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అసైన్ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను పరిశీలించి, తెలంగాణలోనూ అసైన్ భూముల పట్టాదారులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించే విధంగా సమగ్ర విధానాన్ని రూపొందించాలని సూచించారు. పేదల ఆర్థిక స్వావలంబన, సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు ధర్మసాగర్‌లో మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి పర్యటన

**రూ.92 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం**

**ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి**

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూలై 16 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ శాసనసభ్యుడు కడియం శ్రీహరి గురువారం ధర్మసాగర్ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించనున్నారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, ఇటీవల పూర్తయిన అభివృద్ధి పనులను ప్రజలకు అంకితంచేయనున్నారు. ఉదయం 9.30 గంటలకు ధర్మసాగర్ మండల కేంద్రానికి చేరుకోనున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రూ.92 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రహదారులను ప్రారంభించనున్నారు. అదే సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల నిర్మాణ కార్యక్రమం కింద పూర్తయిన నూతన ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తూ ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు. ఈ అభివృద్ధి పనులతో గ్రామంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశుధ్య పరిస్థితులు కూడా మెరుగవుతాయని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అంతర్గత సీసీ రహదారుల నిర్మాణం వల్ల వర్షాకాలంలో బురద సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుండగా, ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరిందని స్థానికులు పేర్కొంటున్నారు.



ఈ కార్యక్రమాలకు జిల్లా, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

# జానకిపురంలో భూసర్వేకు వేగం





**10 రోజుల్లో పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ రవి**

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూలై 15 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం జానకిపురం గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన భూసర్వే పనులను అదనపు కలెక్టర్ రవి బుధవారం పరిశీలించారు. నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పది రోజుల్లో భూసర్వే పనులు పూర్తి చేయాలని, అన్నదమ్ముల మధ్య భూ వివాదాలు ఉన్నా సర్వే ప్రక్రియను నిలిపివేయవద్దని సూచించారు. ఈ సర్వే పూర్తయితే భవిష్యత్తులో భూ వివాదాలకు చెక్ పడుతుందని, ప్రతి భూమికి భూధార్ నంబర్ కేటాయించబడుతుందని రైతులకు వివరించారు. కుటుంబ సభ్యుల మధ్య భూ పంపకాలు పెండింగ్‌లో ఉంటే పరస్పర అంగీకారంతో త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు. రైతులందరూ సర్వే సిబ్బందికి సహకరించి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని కోరారు.

పర్యటనలో తహసీల్దార్ బావ్‌సింగ్, గ్రామ సర్పంచ్, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# కొత్తపేటలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం.

### -సర్పంచ్ ప్రవీణ్ నాయక్.

**బయ్యారం/,జులై 15.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీలో సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. 10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో 11 వ వార్డ్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ అభివృద్ధిపై దృష్టి సారించలేదని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలోని అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్రామంలోని ప్రతి వార్డు సమానంగా అభివృద్ధి చెందాలన్నదే తమ లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రావి వీరభద్రరావు, వార్డు మెంబర్ ఇరప సాంబశివరావు, సీతారాంరెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసం ావు, కండపు సుధాకర్, జగన్ కాలనీ వాసులు ఉన్నారు.





# బడికి వెళ్లలేని వారికి సువర్ణావకాశం

**ఓపెన్ స్కూల్లో టెన్త్, ఇంటర్ పరీక్షలు**

**ఈ నెల 28 వరకు దరఖాస్తులకు గడువు**

**వర్ధన్నపేట కోఆర్డినేటర్ కయిత శ్రీనివాస్ వెల్లడి**



**వర్ధన్నపేట/జూలై 15(జర్నలిస్ట్ వార్త):** కుటుంబ, ఆర్థిక పరిస్థితుల వల్ల రెగ్యులర్గా బడికి వెళ్లి చదువుకోలేకపోయిన వారికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సిస్టం (టాస్) చక్కని అండగా నిలుస్తోంది. వృత్తులు, ఉద్యోగాలు చేసుకుంటూనే నేరుగా టెన్త్, ఇంటర్ పరీక్షలు రాసుకునే సువర్ణావకాశాన్ని కల్పిస్తోంది. 14 ఏళు దాటిన వారు టెన్త్‌కు, 15 ఏళ్లు దాటి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చని వర్ధన్నపేట జడ్పీ హైస్కూల్ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, హెచ్ఎం కయిత శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కారుణ్య నియామకాలు, ఉద్యోగాల్లో పదోన్నతులు ఆశించే వారికి, మధ్యలో చదువు మానేసిన వారికి ఈ విధానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కేవలం ఐదు సబ్జెక్టులతో ఏడాదిలోనే కోర్సులు పూర్తవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



**కావలసిన పత్రాలు:**

ఆధార్ కార్డు జిరాక్స్
పుట్టిన తేదీ, కుల ధ్రువీకరణ పత్రాలు
పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, తెల్లకాగితంపై సంతకం
టెన్త్ మెమో (ఇంటర్ అభ్యర్థులకు)
ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ

**మరింత సమాచారం కోసం:**

ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం 9949708321, 9440401035 మొబైల్ నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోఆర్డినేటర్ శ్రీనివాస్ కోరారు.

## పిఆర్ టీయు మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు.




**బయ్యారం/,జులై 15.(జర్నలిస్ట్ వార్త)**

పిఆర్ టీయు టీఎస్ బయ్యారం మండల అధ్యక్షులు మోహన్ నాయక్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పిఆర్ టీయు టీఎస్ జిల్లా అధ్యక్షులు మిరియాల సతీష్ రెడ్డి ప్రారంభించారు. ఉపాధ్యాయుల సమస్యల్ని పరిష్కరించే ఏకైక సంఘం పిఆర్ టీయు నేనని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మోహన్ నాయక్ మాట్లాడుతూ పెండింగ్ డిఏ,పిఆర్సి ని వెంటనే అమలు చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇదే అంశంపై మండల ప్రధాన కార్యదర్శి నీలం శ్రీనివాస్ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరసింహారావు,జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్,మండల ఉపాధ్యక్షులు రామారావు,ప్రాథమిక సభ్యులు వెంకట్రావు,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప గుడి పేరుతో ప్రభుత్వ భూమి ఆక్రమణ?

### దేవునూరులో 22 గుంటల్లో ఖనిల్ నాటినట్లు గ్రామస్తుల ఆరోపణ

### విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 15 (జర్నలిస్ట్ వార్త)**:హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవనూరు గ్రామంలోని సర్వే నంబర్ 536లో ఉన్న సుమారు 460 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి ఉంది బీరప్ప గుడి పేరుతో సుమారు 22 గుంటల స్థలాన్ని ఆక్రమించి ఖనిల్ (రాతి స్తంభాలు) నాటినట్లు బుధవారం గ్రామస్తులు ఆరోపించారు. ఈ భూముల గుండా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.గతంలో ఇదే ప్రభుత్వ భూమిని ఆక్రమించే ప్రయత్నం జరిగిన సమయంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనిత అక్కడికి చేరుకుని పనులను నిలిపివేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే కొంతకాలం విరామం తర్వాత మళ్లీ అదే ప్రాంతంలో పనులు ప్రారంభించారని ఆరోపిస్తున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వాస్తవాలను నిర్ధారించాలని, ప్రభుత్వ భూమిపై ఆక్రమణ జరిగినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని దేవనూరు గ్రామస్తులు కోరుతున్నారు.

## వర్షాభావం దృష్ట్యా వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



**ధర్మసాగర్, /జూలై 15: (జర్నలిస్ట్ వార్త)** ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాల నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమున్న వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్ సూచించారు. ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామ రైతువేదికలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.పెసర, మినుము, నువ్వులు, వేరుశనగ, కంది, పొద్దుతిరుగుడు, జొన్న, సజ్జ, రాగులు వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని తెలిపారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమయ్యే నీటితో ఐదు నుంచి ఆరు ఎకరాల ఆరుతడి పంటలు సాగు చేయవచ్చన్నారు. తక్కువ కాలపరిమితి కూరగాయలు, పామాయిల్ వంటి ప్రత్యామ్నాయ పంటలను కూడా పరిశీలించాలని సూచించారు.పంటలు బెట్టకు గురైతే ఎకరానికి ఒక కిలో ఎన్‌పీకే లేదా నాలుగు కిలోల యూరియా, రెండు కిలోల మల్టీకే కలిపి ఆకులపై పిచికారీ చేస్తే పంటలకు తక్షణ శక్తి లభిస్తుందని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. భారత వాతావరణ శాఖ అంచనాల మేరకు రానున్న రెండు నెలలు వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశమున్నందున రైతులు శాస్త్రీయ సాగు విధానాలు పాటించాలని కోరారు. పంట మార్పిడి ద్వారా భూసారం కాపాడడంతో పాటు ఆదాయం పెరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుట్ట రేణుక, వ్యవసాయ విస్తరణ అధికారి ముజాహిద్, రైతులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలి

### బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో పిలుపు

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూలై 15 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఆర్ఎన్ఆర్ పాఠశాలలో బీజేపీ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ అధ్యక్షతన బుధవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ పార్లమెంట్ కో-కన్వీనర్ ఇనుగాల యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ, పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో సీనియర్ నాయకులు గంకిడి వెంకట్‌రెడ్డి, గాజుల సంపత్, పెరుమాండ్ల అమరేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు



దుస్స రాములు, దాసరి సదానందం, మండల ప్రధాన కార్యదర్శి బచ్చు శివప్రసాద్‌రెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు మాచెర్ల అనిరుధ్ కౌండిన్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు గాజా శ్యామ్, బోడపట్ల కుమార్, మిట్టపల్లి వెంకటేశ్వర్లు, రామ్మోహన్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగారంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన.



**బయ్యారం/,జులై 15(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో మహిళా సంఘ భవన నిర్మాణానికి సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ బుధవారం శంకుస్థాపన చేశారు.వీవో సభ్యులకు భవనం నిర్మించుకోవడానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతో రూ.10 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది.కాగా సర్పంచ్,పాలకవర్గ సభ్యులు,ఐకేపీ సిబ్బందితో పాటు మహిళా సంఘ సభ్యులు భూమి పూజ చేశారు.మహిళా సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చుంచు మమతా,వార్డు సభ్యులు చెరుకుపల్లి మనీషా, గుగులోత్ అనూష,గుగులోత్ భద్రు, బానోత్ సరిత,సపవత్ అనిత,మాజీ ఎంపిటిసి చెరుకుపల్లి ఉపేంద్ర, పంచాయతీ కార్యదర్శి సరిత,ఏఈ అనిల్,వెంకన్న,రవి, అశోక్,గోపి, వెంకటేష్,సురేష్,మహేష్,వంశీ,సాయికుమార్,సపవత్ సంతోష్ నాయక్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రేమ వివాదంలో దళిత యువకుడి దారుణ హత్య

### కుల వివక్షతోనే భాస్కర్ ప్రాణాలు తీశారు

- నిందితులపై పీడీ యాక్ట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి
- బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- వర్ధన్నపేట ఉప్పరపల్లిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో భారీ ధర్నా











**వర్ధన్నపేట/జులై 15(జర్నలిస్ట్ వార్త):**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో కుల వివక్ష నేపథ్యంలో ఓ దళిత యువకుడు దారుణ హత్యకు గురైన ఉదంతం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ధర్నా ఉప్పరపల్లిలో హోరెత్తింది.

**ప్రేమించాడనే కక్షతో...**

స్థానికులు, ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన శీనేపల్లి భాస్కర్, అదే గ్రామానికి చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన తమ్మడబోయిన రాజు కుమార్తె నికిత గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం నికిత తండ్రి తమ్మడబోయిన రాజుకు తెలిసింది. భాస్కర్ దళితుడు (తక్కువ కులం) కావడంతో అతడిని ప్రేమించవద్దని రాజు తన కుమార్తెను తీవ్రంగా మందలించాడు. అయినప్పటికీ కుమార్తె వినకపోవడంతో కక్ష పెంచుకున్నాడు.ప్రస్తుతం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల ఒక హోటల్‌లో పనిచేస్తున్న శీనేపల్లి భాస్కర్‌ను ఎలాగైనా అడ్డుతప్పించాలని రాజు పథకం పన్నాడు. ఈ క్రమంలోనే కొందరు వ్యక్తులతో కలిసి భాస్కర్‌ను దారుణంగా హత్య చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

### నిందితులను కఠినంగా శిక్షించాలి

### బిర్రు మహేందర్ మాదిగ

ఈ దారుణ హత్యకు నిరసనగా ఎమ్మార్పీఎస్ గ్రామ, మండల అధికార ప్రతినిధి శీనపల్లి రాజు ఆధ్వర్యంలో స్థానికంగా భారీ నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేవలం కుల వివక్షతోనే రాజు తన కుటుంబ సభ్యులతో కలిసి భాస్కర్‌ను కుల పరువు హత్య చేయించాడు. ఈ హత్యకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిందితులపై పీడీ యాక్ట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, హత్య కేసులు నమోదు చేయాలి. ఈ కేసులో పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యం వహించకుండా, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూడాలి. అని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, హత్యకు గురైన దళిత బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఆ కుటుంబానికి అండగా నిలవాలని డిమాండ్ చేశారు.

### భారీగా తరలివచ్చిన గ్రామస్థులు

ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గోలి సుధాకర్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షులు ముత్యాల మల్లేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు చాడ కరుణాకర్ మాదిగతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, యువకులు, మహిళలు పాల్గొని బాధిత కుటుంబానికి మద్దతుగా నిలిచారు. నిందితులకు శిక్ష పడేవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.